నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

పాడి పశువులు, చేపల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి పశువులు, చేపల పెంపకం చేపట్టే విధంగా ఐకెపి అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో చేపలు, పాడి పశువుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పంపొండ్ నిర్మించుకొని తక్కువ పెట్టుబడి తో చేపలు పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ డిఆర్డిఓ చందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ చూడొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

తరుచూ ఫోన్ చూస్తుండటంతో.. ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం తిప్పాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ (19) ఇంటర్ తర్వాత చదువు మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. తరచూ ఫోన్ చూస్తుండటంతో ఈనెల 4వ తేదీన కుటుంబీకులు మందలించారు. మనస్తాపం చెందిన ప్రవీణ్ వ్యవసాయ బావి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ప్రవీణ్‌ను గ్రామంలో ఉన్న వైద్యులకు చూపించగా పురుగుల మందు తాగాడని తెలపడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

ఫారెస్ట్ అధికారులపై దాడి





గాయపడ్డ ఫారెస్ట్ సిబ్బంది

నవతెలంగాణ-మోపాల్/డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కాల్పోల్‌తండాలోనీ అటవీ ప్రాంతంలో శుక్రవారం అటవీశాఖ అధికారులపై దాడి జరిగింది. ప్లాంటేషన్ నిమిత్తం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె రాధిక తన సిబ్బందితో కలిసి ఉదయం వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్ అక్కడ చదును చూస్తుండటంతో దాన్ని ఆపే నిమిత్తం వెళ్లగా.. తండావాసులందరూ ఏకమై దాడికి దిగారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహిళా అని కూడా చూడకుండా ఆమెపై దాడి చేసినట్టు సమాచారం. దాడిలో సెక్షన్ ఆఫీసర్ సాయి కృష్ణకు ఎక్కువగా గాయాలయ్యాయి. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తో కలిసి ఐదుగురు సిబ్బంది ఇద్దరు బేస్ క్యాంప్ సిబ్బందిపై సుమారు 40 మంది తండావాసులు కలిసి దాడికి దిగినట్టు సిబ్బంది తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ వెంకటరెడ్డి, సిఐ, ఎస్సై గంగాధర్ సిబ్బందితో కలిసి దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

ఫారెస్ట్ అధికారులకు రక్షణ కల్పించాలి : అసోసియేషన్

డిచ్‌పల్లి : మోపాల్ మండలం కాల్పోల్ అటవీ ప్రాంతంలో ఫారెస్టు సిబ్బందిపై తండా వాసులు శుక్రవారం ఉదయం దాడి చేయడం హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన నిందితులను పట్టుకొని వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని బాసర యూనిట్ రేంజ్ అధికారుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇందల్వాయి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందల్ వాయి రేంజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాల్పోల్ బీట్‌లో గత మూడేళ్ల క్రితం 6 ఎకరాల విస్తీర్ణంలో ప్లాంటేషన్‌ను నెలకొల్పినట్టు తెలిపారు. అడవిని రక్షించడం అటవీశాఖ అధికారుల ప్రత్యేక బాధ్యత అని, వీధి నిర్వహణలో భాగంగా కాల్పోల్ అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్ లో పెట్టిన మొక్కలను ధ్వంసం చేశారని సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన అటవీ రేంజ్ అధికారిని రాధిక, సెక్షన్ అధికారి సాయి కృష్ణ, బీట్ అధికారులు ప్రణీత్, లింబాద్రి, ప్రసాద్ లపై దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు మామూలుగా చూడకుండా వీరందరిపై కఠిన చర్యలు తీసుకుంటూనే మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టి, ఫారెస్ట్ అధికారులకు రక్షణ కల్పించాలని రవి మోహన్ బట్ డిమాండ్ చేశారు. ఎక్కడైనా అటవీ ప్రాంతాన్ని ఆక్రమంగా చదను చేసిన అలాంటి వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫారెస్ట్ అధికారులకు ఆత్మరక్షణార్థం ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను

సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు..



మాట్లాడుతున్న కలెక్టర్

ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భూ పరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణిలో భూ సంబంధిత అంశాలపై దరఖాస్తుదారులు సమర్పించిన అర్జీలపై చేపట్టిన చర్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లతో సమావేశమై కీలక సూచనలు చేశారు. ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తక్షణమే పరిశీలిస్తూ, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయిన వాటిని మూడు, నాలుగు రోజుల్లో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా వారం వ్యవధిలోపు అన్నింటినీ పరిష్కరించాలని స్పష్టమైన గడువు విధించారు. బోధన్ తహశీల్ కార్యాలయం పరిధిలో ఎక్కువ సంఖ్యలో ధరణి దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీఓ, తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీఓ, తహసీల్దార్ లాగిన్లలోని పెండింగ్ దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ క్లియర్ చేయాలన్నారు. అలసత్వానికి ఏమాత్రం తావు లేకుండా, దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అదే విధంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాతో ముడిపడిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలపై చేపట్టిన చర్యల గురించి దరఖాస్తుదారునికి వివరాలు తెలియజేయడంతో పాటు, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని అన్నారు. అర్జీలపై తక్షణమే స్పందిస్తూ, సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజావాణి కార్యక్రమం పట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందింపజేయాలని హితవు పలికారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలకు సంబంధించి రోజువారీగా తనకు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- తక్షణమే జెండర్ ఈక్విటీ అధికారి వనితను బదిలీ అయిన చోటుకు పంపాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న కోఆర్డినేటర్ జెండర్, ఈక్విటీ అధికారిని అయిన ఎస్.వనితని పేరెంట్ డిపార్ట్మెంట్‌కు (జిహెచ్‌ఎంగా)రిపార్టీఎట్ చేస్తూ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీ నెం 186/ఎస్ఈఆర్ పేరుతో ఈ నెల 10వ తేదీనా ఉత్తర్వులు జారీ చేశారని, తక్షణమే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని పేర్కొన్నా. జిల్లాలో అమలు కావడం లేదని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను అన్ని జిల్లాల అధికారులు అమలు చేసినప్పటికీ, ఈ జిల్లాలో మాత్రం ఉత్తర్వులు వెలువడి నేటికి నాలుగు రోజులు గడిచినా సదరు అధికారిని ఎస్.వనితని డిఇఓ రిలీవ్ చేయకపోవడం ఉన్నతాధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. శుక్రవారం ప్రతినిధులు డీఈవోకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికైనా పై అధికారుల ఆదేశాలపై తక్షణమే స్పందించి ఆమెను రిపార్టీయేట్ చేయగలరని ఈ సమాచారాన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాల విద్య, వరంగల్ కి నివేదించి ఉత్తర్వులకు అనుగుణంగా పోస్టింగ్ ఇచ్చుటకు చర్యలు తీసుకునగలరని డిఇఓకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిజామాబాద్ జిల్లా శాఖ పక్షాన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా డిఇఓ స్పందిస్తూ తనకు ఈ అంశంపై అధికారిక మెయిల్ రాలేదని, అందుకే రిలీవ్ చేయలేదని అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పలు ఆదేశాలను వాట్సాప్, టెక్స్ మెసెజ్ ల ద్వారా పంపిన సందర్భంలో అమలు చేసిన డిఇఓ ఈ ఒక్క అంశంపై మాత్రం అధికారిక మెయిల్ రాలేదని చెప్పడంలో మతలబు ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు వై. విజయ్ కుమార్, పి. శాంతన్, డి. సత్యానంద్, డాక్టర్. సల్ల సత్యనారాయణ, జి. సుదాం, ఆర్. పెంటన్న, ఎన్. ప్రభాకర్ పాల్గొన్నారు.

జెండాలు తొలగించకుంటే ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-లింగంపేట్



ధర్నా చేస్తున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే

రుణాల చెల్లింపు ఆలస్యమైనందుకు తమ పంటపొలాలను స్వాధీనం చేసుకుంటామని పొలాల్లో పెట్టిన జెండాలను తొలగించకుంటే ఉద్యమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు. పొలాల్లో పెట్టిన జెండాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో రైతులు లింగంపేట్ మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టేది అన్నదాతలే నని, అలాంటి రైతులను మానసికంగా రుణాల వసూల పేరుతో వేధించడం తగదని అన్నారు. అన్నం పెట్టే రైతుల భూముల్లో బ్యాంక్ అధికారులు జెండాలు పాతడం చరిత్రలో ఎక్కడ లేదన్నారు. జెండాలను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందే కాకా అధికారంలోకి రాగానే రుణాల వసుళ్ల పేరుతో వేధింపులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి మళ్ళీ ఆగస్టు 15కు వాయిదా వేసినట్లు తెలిపారు. రైతులు పంటల సాగు కోసం రుణాలు తీసుకొని వాయిదా అడిగిన వినకుండా పొలాలలోకెళ్ళి జెండాలు పాతడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రైతులను వేధింపులకు గురి చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని రైతులు ఎలాంటి ఆందోళనలను చెందవద్దని వారికి తోడుగా మాజీ సీఎం కెసిఆర్ ఉన్నారని భరోసా ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ తో మాజీ ఎమ్మెల్యే వాగ్వాదానికి దిగారు. ఫ్లెక్సీలను, పాతిన ఎర్రజెండా లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దివిటి రమేష్, మనోహర్, సాయి కిరణ్. రాజశేఖర్ రెడ్డి. రాములు మహిపాల్. నరేష్, బండి నరసింహులు, రవీందర్ నాయక్, గన్ను నాయక్, ఉమ్లా లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద డ్రయినేజీ పనులు పూర్తిచేయాలి

- సీపీఐ(ఎం) డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బస్టాండ్ వద్ద గల డ్రయినేజీని పూర్తిచేయాలని సీపీఐ(ఎం) డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ బస్టాండ్‌లోకి మురుగు నీరు చేరడం వల్ల బస్టాండ్ బురదమయంగా మారుతుందని గతంలో ధర్నా సైతం చేసినట్టు గుర్తుచేశారు. డ్రయినేజీ మంజూరుకాగా నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్టు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్ వద్ద రద్దీ మహిళలు అధిక సంఖ్యలో ఉంటున్నారని, స్కూళ్లు ప్రారంభమైన రీత్యా ప్రజలతో బస్టాండ్ కిక్కిరిసి ఉండటం వలన యాక్సిడెంట్ జరగడానికి ప్రమాదం ఉందని బస్సులు ఒకే చోట నుండి పోవటం రావటం చాలా ఇబ్బందిగా మారినట్టు తెలిపారు. మూడు రోజుల క్రితం ఓ మహిళ రెండు కాళ్లు విరిగిన విషయం చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే డ్రైనేజీ తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించాలని, బస్టాండ్ ప్రాంతంలో పనులు ఆగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య, డివిజన్ కమిటీ సభ్యులు తోకటి భువనేశ్వర్, భామండ్ల రవి, కుల్దీప్ శర్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కామారెడ్డి




అధికారులతో కలిసి రివ్యూ నిర్వహిస్తున్న షబ్బీర్ అలీ

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ 20,21,22 పనులు పూర్తి చేసి కామారెడ్డి జిల్లా రైతులకు రెండు లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే ధ్యేయంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పనులు ప్రారంభించానని.. సకాలంలో పనులు పూర్తిచేస్తామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి అవుతే కాంగ్రెస్ పార్టీకి షబ్బీర్ అలీ కి పేరు వస్తుందని దానిపై కక్ష కట్టి, ఎలాంటి నిధులు విడుదల చేయకుండా తొక్కి పెట్టారని అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని తన నివాసంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఈఈ మల్లేష్ పోచమ్మ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎట్టి పరిస్థితుల్లో తాను కలలుగన్న ప్రాజెక్ట్ ప్రాణహిత చేవెళ్ల 20, 21, 22 పూర్తి చేయాలని పట్టుదలతో ప్రతిరోజు అధికారులతో ముఖ్యమంత్రి, మంత్రులతో ప్రాజెక్టు విషయంలో చర్చలు చేస్తున్నట్టు తెలిపారు. అతి త్వరలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో, అధికారులతో రివ్యూ మీటింగ్ ఉందని 400 కోట్ల రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ప్రాణహిత చేవెళ్ల పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఆ దిశగా తన వంతు ప్రయత్నం చేస్తున్నానని తప్పకుండా నిధులు మంజూరు చేయించి పని పూర్తి చేస్తానన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు

- కామారెడ్డి ఏడిఏ అపర్ణ



దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కామారెడ్డి టాస్క్ ఫోర్స్ ఏ డి ఏ అపర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు బిల్ బుక్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయి నా దుకాణం దారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట కామారెడ్డి ఏ వో శ్రీనివాస్, నాగిరెడ్డిపేట ఏ వో విజయ శేఖర్, దోమకొండ ఏవో పవన్ కుమార్, ఎస్సై రాజు ఉన్నారు.

రక్తదానంచేసి ప్రాణాలు నిలబెట్టండి

నవతెలంగాణ-సదాశివనగర్



రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పలువురు

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా లింగంపల్లి గ్రామంలో ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ, గ్రామ ప్రజలు, యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ యువకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి 45 యూనిట్ల రక్తదానం చేశారు. జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ అధికారి చల్ల సుధాకర్ మాట్లాడుతూ అన్ని దానాల్లో విద్యా దానం గొప్పది అంటారని, కానీ జ్ఞానం ఇచ్చే విద్య దానం కంటే ప్రాణం పోసే రక్త దానం గొప్పదేమోనని అనిపిస్తుందని అన్నారు. అంతేకాదు ప్రతి ఒక్కరూ చేయగల దానం నా వద్ద లేదు అని తప్పించుకోలేని దానం చాలా సులువుగా చేయగల దానం రక్తదానం ఏ దానం చేయాలన్న అది డబ్బుతో ముడిపడి ఉంటుందని తెలిపారు. ఒక రక్త దానమే మనస్సుతో ముడిపడి ఉంటుందని తెలిపారు.

ఐయస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ రక్త దానానికి ఆరోగ్యవంతులందరూ ముందుకు రావాలని సూచించారు. ఆస్పత్రుల్లో పలువురు రోగులు రక్తం దొరక్క ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత శస్త్రచికిత్స, గర్భిణుల డెలివరీ, తలసేమియా వ్యాధిగ్రస్తులు, క్యాన్సర్ రోగులు, సికిల్ సెల్ ఎనీమియా రోగులు ఎంతో మంది రక్తం దొరక్క పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావని, ఈ సమ యంలో రక్తదాతలకు నమస్కరించి విన్నవిస్తున్నా. రక్త దానం చేయండి.. ప్రాణాలు నిలబెట్టండి అని కోరారు. కార్యక్రమంలో ఐ ఎస్ ఆర్ డి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి, ప్రతినిధులు శివాజీ రావు, ఆర్ల విఠల్ రావు, రుస్తుం సంతోష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సౌమ్య వైద్యాధికారి, ప్రమోద్ కుమార్,అరుణ్ కుమార్ సాయి కుమార్, ఈతరం యూత్ క్లబ్ సభ్యులు కామిల్ల సంజీవులు, ప్రసాద్, భాస్కర్,రాకేష్, ఛత్రపతి శివాజీ యూత్ క్లబ్ సభ్యులు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-2025 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది కావున మండలంలోని పదో తరగతి పూర్తయిన విద్యార్థులు నిజాంసాగర్ ప్రభుత్వ కాలేజీలో అడ్మిషన్లు పొందాలని ఆయన సూచించారు. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఈసి, హెచ్ఈసి కోర్సులలో ఖాళీలు ఉన్నాయని ఆయన తెలిపారు. అడ్మిషన్ రుసుము ఉచితమని దానితోపాటు టెక్స్ బుక్స్ ఉచితంగా అందిస్తామని అలాగే స్కాలర్షిప్ సౌకర్యం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. వేరే గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని మండలంలోని విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. అడ్మిషన్లు నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్నాయని అడ్మిషన్ల కొరకు 9640097638, 9059692898 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

బోర్గాం (పి) పాఠశాలను సందర్శించిన డీఈవో



బోర్గాం పీ పాఠశాలను సందర్శించిన డీఈవో

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం(పి) జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ పాఠశాలకు జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాముఖ్యత ఉందని మంచి విద్యనభ్యసించి మీ తల్లిదండ్రులతో పాటు పాఠశాల కూడా పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి హెచ్ శంకర్ పాల్గొన్నారు.

డబ్బు విషయంలో తగాదా..

అత్తను చంపిన కోడలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని బండ రేంజర్ గ్రామంలో అత్త కోడలు ఘర్షణ పడి కోడలు అత్తను చంపినట్లు బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బండరెంజల్ గ్రామానికి చెందిన దుబ్బ బాలవ్వ (65) భర్త, కొడుకు, కోడలితో కలిసి ఉంటున్నారు. తరచూ డబ్బులు విషయంలో కుటుంబ సభ్యుల విషయంలో అత్తా కోడలు గొడవలు పడేవారు. శుక్రవారం అత్తా, కోడలు గొడవపడగా అత్త దుబ్బబాలవ్వను గొంతు నులిమి కోడలు అంజవ్వ చంపేసినట్లు భర్త విట్టబోయి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పున:ప్రారంభం

నవతెలంగాణ-మోపాల్

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు గతంలో ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టిన విషయం విధితమే. వాటి ఆధారంగా అర్హులకు పథకాలు అందజేసింది. కాగా ఎన్నికలు రావడంతో కోడ్‌లో భాగంగా దరఖాస్తుల స్వీకరణ నిలిపివేయగా.. తాజాగా శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ పున:ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులను తీసు కుంటున్నట్టు ఎంపీడీవో లింగం నాయక్ తెలిపారు. మం డలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

హెచ్ఐవి, గృహహింసపై అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కేశ్‌పల్లి గ్రామసంఘం సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంకు ఉమెన్స్ ఆర్గనైజేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత హాజరై హెచ్ఐవి ఎయిడ్స్, కిషోర్ బాలికల శిక్షణ గురించి, గృహహింసపైన సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంకు సంఘ సభ్యులు, గ్రామ సంఘం ప్రతినిధులు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ దశరథ్, వివోఏలు హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఐక్యఉద్యమాల సారథి ఎంప్లాయీస్ యూనియన్

- ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎంప్లాయిస్ యూనియన్ 11వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను శుక్రవారం జి రవిచందర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఏఐటి యుసి ఎయిర్ బస్ సెక్రటరీ శ్రీనివాస్ ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి గోపి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉన్న ఒకే ఒక్క యూనియన్ ఐక్య ఉద్యమాల సారథి ఎంప్లాయిస్ యూనియన్ అని వివరించారు. రావలసినవి రాబోయేవి ఇప్పించడంలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రత్యేక పాత్ర వహించింది అని తెలిపారు ప్రభుత్వాలు ఏవి ఉంటే వాటికి తొత్తులుగా ఉండే యూనియన్ల ద్వారా ఏమి కాదని వివరించారు. ఇప్పటికైనా కార్మికులు కార్మికుల పక్షాన పోరాడే ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతు తెలిపాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు జి రవి చందర్ అర్గుల్ రమేష్, గోపి, జయ కుమార్, బాలాజీ గోవర్ధన్, నారాయణ సుధాకర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బిజెపి రాష్ట్ర నాయకులు



కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ రాష్ట్ర నాయకులు అల్జపూర్ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అల్జపూర్ శ్రీనివాస్ ఢిల్లీ వెళ్లి తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర మంత్రులుగా నియమితులైన సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మరియు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిని కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించారు.

మున్సిల్ కార్మికులకు రెయిన్‌కోట్, పనిముట్లు ఇవ్వాలి



నిరసనలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు రెయిన్‌కోట్, ఇతర పనిముట్లు ఇవ్వాలని కమిషనర్ కు వినతి, ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్య నిర్వాహక అధ్యక్షులు పి. సుధాకర్, ప్రధాన కార్యదర్శి పి.నర్సింగరావు ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమస్యలపై శుక్రవారం నగరపాలక సంస్థ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా ఔట్సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ కార్మికులకు వచ్చేటటువంటి బెనిఫిట్స్ సబ్బులు, నూనెలు, బట్టలు, కుట్టు కూలీలు, పనిముట్లు, చీపుర్లు, పారలు, గ్లౌజులు, బూట్లు, రైన్ కోర్ట్ ఈఎస్ఐలో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని ఔర్సింగ్ కార్మికులకు అందరికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కమిషనర్ మంద ముకుందంకి వినత పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ,ధర్మవ్వ, సుజాత, లింగం, వరలక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిపామ్‌ల పంపిణీ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని పొట్టిగుట్ట తండా, కూనిపూర్, ఆపంది పారం తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏక రూప స్కూల్ యూనిపామ్ లను ఐకేపీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐకేపీ ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సకాలంలో యూనిపామ్ లను అందిస్తునమని తెలిపారు. పలు గ్రామాలలో సిసిలు విద్యార్థుల యూనిపామ్ లు అందించటంలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సిసి లు ఫుల్ సింగ్, తుకారం,రమేష్ పలు పాఠశాల హెడ్ మాస్టర్లు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు యూనిఫామ్‌లు అందజేత



జక్రాన్‌పల్లి : మాట్లాడుతున్న డాక్టర్ అశోక్



డిచ్‌పల్లి: మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్‌కుమార్

టీబీని పారదోలడానికి బిసిజి వ్యాక్సినేషన్

- వయోజన బీసీజీ టీకా పర్యవేక్షణ అధికారి డాక్టర్ సంతోష్ కుమార్
- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

భారతదేశం నుండి టీబీ వ్యాధిని పారదోలడానికి వయోజనులకు బిసిజి వ్యాక్సినేషన్ అవసరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్‌పై ఇంటింటి సర్వే కోసం మండలంలోని ఏఎన్ఎంలకు ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై ఇంటింటికి సర్వేకు ఎఎన్ఎమ్, ఆశాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌డిడి కోసం 1-19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ ఇవ్వడం ద్వారా వార్మ్ ఇన్‌ఫెక్షన్‌ను నివారించడానికి, వార్మ్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. వయోజన బీసీజీ టీకాపై ఇంటింటికి సర్వే చేయడానికి శిక్షణ ఇచ్చారు. అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమం ఆగస్టు 2024 నుండి ప్రారంభం కానుందని, 18 ఏళ్లు పైబడిన వారు షుగర్ ఉన్నవారు, ధూమపానం చేసేవారు, గత 5 సంవత్సరాల్లో టీబీతో బాధపడుతున్నవారు తక్కువ బిఎంఐ ఉన్నవారు 60 ఏళ్లు పైబడిన వారు కూడా అర్హులని తెలిపారు. ఇది భారతదేశం నుండి టీబీ వ్యాధిని నిర్మూలించడం కోసం ప్రయత్నం అని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీజీ వ్యాక్సినేషన్ ఇన్చార్జి ఆఫీసర్ డాక్టర్ సతీష్, మండల వైద్యాధికారి రవీందర్, ఆరోగ్య విస్తరణ అధికారి అఖిల్ ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు మండల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పెద్దవారికి బీసీజీ టీకా కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన బీసీజీ టీకా పర్యవేక్షణ అధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. 60 ఏళ్ల పైబడిన వారందరికీ బీసీసీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని, 18 ఏళ్ళ పైబడి పొగ తాగుడు అలవాటు ఉన్నవారు.. లేదా.. గతంలో టీబి వ్యాధిగ్రస్తులు ఐదు ఏళ్ళ క్రితం టీబి మందులు వాడిన వారు, టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధం గలవారు ఉన్నట్లయితే వారందరి పేర్లు నమోదు చేసుకోవాలని సర్వే నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు అందరూ ఈ సర్వేను క్రోడీకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు నివేదిక పంపాలని బీసీసీ వ్యాక్సినేషన్‌కు ఎన్ని సెషన్స్ కావాలో తెలపాలని కోరారు. సరియైన ప్రణాళిక తయారుచేసి దశలవారీగా 60సంవత్సరాలు పైబడిన వారందరికీ తప్పకుండా వయోజన బీసీసీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవికుమార్, టీబీ పర్యవేక్ష కురాలు స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షణ అధికారి అక్బర్ అలీ, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు

కనీస వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని లేబర్ అధికారికి బిఎల్ టియు నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ మాట్లాడుతూ.. వాటర్ సప్లయ్, గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్, పారిశుధ్య ఔట్ సోర్సింగ్ జవాన్లకు కనీస వేతనం 19,500 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న వాటర్ సప్లయ్, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, పారిశుధ్య ఔట్ సోర్సింగ్ జవాన్లకు 30శాతం పీఆర్సీ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఖమ్మం, వరంగల్, రామగుండం మొదలు మున్సిపల్ కార్పొరేషన్‌లలో కనీస వేతనం రూ: 19500 అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈవిషయాన్ని గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుండి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దృష్టికి తేవడం జరిగింది. కానీ ఇంతవరకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్పందించిన పరిస్థితి లేదని అన్నారు. కనీస వేతనం రూ: 19500 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, లేనియెడల సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టియు నాయకులు జి.యాదయ్య, శ్రీశైలం, మురళి, హరీష్,, బిఎల్ టియు జిల్లా నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్, కె. సతీష్ లు పాల్గొన్నారు.



వినతిపత్రం అంజేస్తున్న బిఎల్‌టియు నాయకులు

గుంత పూడ్చారు

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-ఎడపల్లి

గుంతను తవ్వారు.. వదిలేశారు అనే కథనం శుక్రవారం నవ తెలంగాణ పత్రికలో ప్రచురితమైంది. ఈకథనానికి ఎడపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి నాగ రాజుతోపాటు సిబ్బంది స్పందించారు. మండల కేంద్రంలోని ఏడవ వార్డులో పక్షం రోజుల క్రితం మంచినీటి ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న పైప్ లైన్ లీకేజ్ అవుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజుతోపాటు సిబ్బంది లీకేజీ అవుతున్న పైప్ లైన్‌కు మరమ్మత్తులు చేపట్టి గుంతను పూడ్చివేశారు. బోధన్ నిజామాబాద్ రాకపోకలు సాగే వాహనాలే కాకుండా. స్థానిక కాలనీవాసులకు గ్రామస్తులకు ఇబ్బందులు కాకుండా గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రత్యేక చర్యలు తీసుకొని పైప్ లైన్ మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చివేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎడపల్లి మండల ఇన్చార్జి గబ్బర్ సింగ్ సూచన మేరకు గుంతను పూడ్చి వేయించారు. కాలనీవాసులు సైతం హర్షణ వ్యక్తం చేస్తున్నారు.



గుంత పూడ్చివేయిస్తున్న సెక్రెటరీ

'జీరో'విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా చర్యలు చేపట్టాలి

- అపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్
- ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో ని నిజామాబాదు సర్కిల్ పరిధిలో "జీరో "విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని అపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వలన విద్యుత్ వినియోగదారుల గృహాల్లోని

నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల , నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు. ఓఅండ్ఎం ఉద్యోగులు భద్రతా పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ వారికి భద్రత పరికరాలు అందచేస్తున్నామని అన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి, క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ ఈ నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్షన్ ఇంఛార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలన్నారు. అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలని, ఫోన్ ద్వారా లైన్ క్లియర్లను ఇవ్వడాన్ని నివారించాలని, విధుల్లో ఉన్న ఎస్ఎల్ఐ, ఎల్ఐ బ్రేక్ డౌన్ వర్క్ లొకేషన్ వద్ద ఉండాలని తెలిపారు. ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలని, తప్పనిసరిగా వినియోగించేటట్లు చేయాలని, హెచ్‌టిఎల్‌టి లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ మరియు వోల్టేజ్ డిటెక్టర్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని, తప్పనిసరిగా వినియోగించేటట్లు చేయాలని అన్నారు.

లైన్ సమీపంలో వోల్టేజ్ డిటెక్టర్‌ను ఉంచడం, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ ను తాకడం ద్వారా లైన్ డెడ్‌గా ఉందని నిర్ధారించుకోవాలన్నారు. లైన్కు రెండు వైపులా సరైన ఎర్తింగ్ కోసం అన్ని దశల్లో ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ ను ఉపయోగించాలని, 33 కెవి, 11 కెవి లైన్ సింగిల్ లైన్ నమూనా రేఖ చిత్రాన్ని ప్రతి సెక్షన్ ఆఫీసు వద్ద ఏబీ స్విచ్, డబుల్ పాయింట్ ఆఫ్ సప్లై, హెచ్‌టి లైన్ క్రాసింగ్ లోకేషన్‌ను సూచిస్తూ ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి సిబ్బందికి వద్ద ఒక కాపీని అందుబాటులో ఉంచుకోవాలని, బ్రేకర్లు, రిలేల యొక్క సరైన పనితీరును నిర్ధారించడం, విశ్వసనీయ రక్షణ కోసం ఫీడర్, ఎల్‌వి బ్రేకర్స్ రిలేలలో తగిన ఈఎల్, ఓఎల్ సెట్టింగ్లను మార్చాలని అన్నారు. సెక్షన్ ఆఫీసర్ సబ్ డివిజన్ ఆఫీసర్ (ఏడిఈ) వద్ద బ్రేక్ డౌన్ల సమాచారం, నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలని, మెయింటెనెన్స్, అవుట్ వర్క్ జరుగుతున్న చోట సెక్షన్ ఆఫీసర్, ఏడీఈ ఆకస్మిక తనిఖీ చేయాలని తెలిపారు. భద్రతా ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు గుర్తించినట్లయితే చర్యలను తీసుకోవాలని, డివిజనల్ ఇంజనీర్, టెక్నికల్, సర్కిల్ ఆఫీస్ నోడల్ సేఫ్టీ ఆఫీసర్ ఓఅండ్ఎం సిబ్బంది భద్రతా నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారో... లేదో.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, విద్యుత్ ప్రమాదాలపై భద్రతా జాగ్రత్తలను ప్రజలకు అవగాహన పెంపొందించడానికి మున్సిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రదేశాలు, సినిమా థియేటర్లు, క్రాస్ రోడ్ జంక్షన్లు, పాఠశాలలు, కళాశాలలు మొదలైన ప్రదేశాల్లో విద్యుత్ భద్రత అవగాహన సదస్సులు , నివారణ సూచనలు, జాగ్రత్తలు తెలియచేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు .

టీజీ ఎన్పీడీసీఎల్‌లో తాజా ప్రమాణాల భద్రతా విధానాలతో ఉద్యోగులకు తగు శిక్షణ కార్యములు నిర్వహిస్తూ, సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు అనగా హెల్మెట్, గ్లోవ్స్, పోర్టబుల్ ఎర్తింగ్ షార్ట్, సర్యూట్ కిట్లు, సేఫ్టీ షూస్, ఇన్సులేటెడ్ టూల్స్, వోల్టేజ్ డిటెక్టర్ మొదలైనవి అందచేస్తూ వారికి నియమిత కాల వ్యవధిలో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీల్డ్ సిబ్బంది నుండి సీనియర్ అధికారుల వరకు ఉద్యోగులందరి నుండి సమిష్టి కృషి అవసరమని, సమర్థవంతంగా తగ్గించడానికి అన్ని అంశాలలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యమని, నిరంతర శిక్షణ మరియు భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వల్ల సంస్థలోని భద్రతా ప్రమాణాలను పెంచగలిగే పరిస్థితి తీసురావాలని ఆకాంక్షించారు. టీజీ ఎన్పీడీసీఎల్‌ను విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరు విధిగా భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని, జీరో విద్యుత్ ప్రమాదాల ధ్యేయంగా పని చేయాలనీ కోరారు.

నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్‌కు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా శాఖకు వివిధ అంశాల మీద అవార్డులు వచ్చాయి. ఉత్తమ రక్తదాతగా పి పురుషోత్తం రెడ్డి , ఉత్తమ మోటివేటర్‌గా జిల్లా రెడ్ క్రాస్ కోశాధికారి కరిపె రవీందర్ , స్వచ్ఛంద రక్త దాన శిబిరాలు నిర్వహించిన ప్రభుత్వ రంగ విభాగంలో పీఆర్‌టీయూ అధ్యక్షులు పి మోహన్ రెడ్డి, కళాశాల విభాగంలో నిశిత డిగ్రీ కళాశాల డైరెక్టర్ సి.విజయ బాబు (రాజు) కి రాజ్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డులు పొందారు. తెలంగాణలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకి ఉత్తమ బ్లడ్ బ్యాంకు అవార్డు వచ్చింది. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్ క్రాస్ అధ్యక్షులు అజయ్ మిశ్ర, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, నిజామాబాద్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ , కార్పె రవీంద్ర పాల్గొన్నారు.

అర్గుల్ విద్యార్థులకు నేషనల్ మెన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్లు మంజూరు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లోని ముగ్గురు విద్యార్థులకు నేషనల్ మెన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత శుక్రవారం తెలిపారు. సిహెచ్ మదన్, ఏ. అక్షయ్ కుమార్, డి. అఖిల్, వీరికి ప్రతి సంవత్సరం 12వేల రూపాయలు ఇంటర్ అయ్యే వరకు నాలుగు సంవత్సరాల కాలంలో 48వేల రూపాయలు వస్తాయని ప్రధానోపాధ్యాయులు సుజాత తెలిపారు. వీరికి స్కాలర్‌షిప్ మంజూరు కావడానికి ప్రయత్నించిన ఉపాధ్యాయులను, గ్రామస్తులు అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆరు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్ గౌడ్‌కు శుక్రవారం ఎస్ఐ రవీందర్, సిబ్బంది తో కలిసి శాలువాతో సన్మానించారు. రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ... ఆరు సంవత్సరాలు మండలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాజ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ ను సన్మానిస్తున్న ఎస్ఐ రవీందర్

పోగొట్టుకున్న పర్సు అందజేసిన పోలీసులు

నవతెలంగాణ-రామారెడ్డి

ధర్పల్లి మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బాదావత్ భాస్కర్ కామారెడ్డి నుండి రామారెడ్డి మీదుగా కొట్టాలపల్లి వెళుతుండగా పర్సు పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పర్సును వెతికి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజ నరసయ్య తదితరులు ఉన్నారు.



పర్సు అందజేస్తున్న పోలీసు సిబ్బంది

ఏరులై పారుతున్న కల్తీకల్లు





- నాటుసారపై చూపుతున్న శ్రద్ధ.. కల్తీకల్లు కట్టడిపై చూపని ఎక్సైజ్ శాఖ
- అనేకరోగాల బారిన పడుతున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి



జోరుగా కల్తీకల్లు తయారు చేసి విక్రయాలు చేపడుతున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ కల్లు తయారు చేసేందుకు అనేక కెమికల్స్ వినియోగిస్తుండటంతో కల్లు సేవించిన వారు.. అనేక రోగాల బారిన పడుతున్నారని, కల్లు సేవించడం వ్యసనంగా మారుతుండటంతో దాన్ని మానేస్తే ఫిట్స్ గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటుసారా తయారీ కట్టడిపై చూపిన శ్రద్ధ.. కల్తీ కల్లు నిరోధించడానికి చూపడం లేదని జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీ కల్లు తయారీ కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగాల బారి..

చెట్టు నుండి వచ్చిన కల్లును విక్రయించకుండా నీటిలో డైజోఫామ్, వైట్‌నర్ కలుపుతూ కృత్రిమ కల్లును తయారు చేస్తూ అందులో మత్తు పదార్థాలను కలుపుతూ విక్రయిస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డైజోఫామ్, ఆల్ప్రాజోమ్ ఈ పదార్థాలను కలుపుతూ కళ్ళ లేకున్నా నీటిలో వైట్‌నర్ కలుపుతూ కల్లును తయారు చేస్తున్నారు. లేదా చెట్టు నుండి వచ్చిన కల్లులో డైజోఫామ్, ఆల్ప్రాజోమ్ లను లీటర్ కల్లులో కలుపుతూ 50 లీటర్లుగా కల్లును తయారుచేస్తున్నారు. ఇది సేవించిన ప్రజలు వాహనాలపై వెళుతూ రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు. అంతేకాకుండా వీరికి ఫిట్స్ వస్తు ఆసుపత్రిలో చేరి ఆర్థికంగా శారీరకంగా నష్టపోతున్నారు. ఈ కల్తీకల్లు వల్ల ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడం విడ్డూరంగా ఉందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటు సారా తయారీ, విక్రయాలకు ఏ విధంగా అయితే కట్టడి చేశారో అదే విధంగా కల్తీ కల్లు విక్రయాలను కట్టడి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

టెంట్ ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలి

- ఈద్గ-కబ్రస్థాన్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

బక్రీద్ పండుగ నేపథ్యంలో ఈద్గా-కబ్రస్థాన్ వద్ద టెంట్ ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చాలని మున్సిపల్ అధికారులకు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని కామారెడ్డిలోని కోర్ట్ రోడ్‌లో గల ఈద్గ- కభ్రస్థాన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలోని వైస్ చైర్ పర్సన్ ఉర్దుండ వనిత రవి, మున్సిపల్ ముస్లిం కమిటీ మెంబర్స్, మజీద్ సదర్ ఫారూఖ్, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్, చాట్ల రాజేశ్వర్, పాత శివ కృష్ణమూర్తి, అన్వర్ హైమద్, పంపరి శ్రీనివాస్, మహమ్మద్ ఇషాక్ షేరు, మమత, సాయిబాబా, హాఫీస్ మిర్జా బాగ్, ఎండి సలీం, చాట్ల వంశీకృష్ణ,ఎండి లడ్డు, ఎండి యామిన్, లక్ష్మీనారాయణ, జమీర్, ఇమ్రాన్, మున్సిపల్ అధికారులు, భవాని, రవీందర్ తదితరులు పాల్గొన్నారు .

స్కూళ్లల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలు అరికట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు విక్రయిస్తున్న ప్రయివేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత తంత్ర విద్యార్థి సమైక్య 'ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పలు ప్రయివేటు స్కూళ్లు ఒక మడిగె కిరాయికి తీసుకొని అక్కడి నుంచి విక్రయాలు చేపడుతున్నారని అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టానికి లోబడి ఫీజులు నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు విద్యాసంస్థలు సమస్యలతో స్వాగతం పలికాయని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు కనీస సౌకర్యాలు లేని విధంగా తయారయ్యాయని పోటీ బడి అడ్మిషన్లు చేసుకుంటున్నారని, అనే విద్యా బోధనలో ఎటువంటి నాణ్యత లేదని ఆయన అన్నారు. ఇకనైనా డీఈవో, ఎంఈఓ విద్యాశాఖ అధికారులు అనుమతి నడుస్తున్న పాఠశాల పైన చర్యలు తీసుకుని గుర్తింపును రద్దు చేయాలని, పాఠ్య అపుస్తకాలు అధిక ధరల విక్రయిస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఫయాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలతోనే బంగారు భవిష్యత్

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బాలికల ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తూర్పు రాజులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అన్ని రకాల సౌకర్యాలతో కొనసాగుతున్నాయని తెలిపారు. కావున పిల్లల తల్లిదండ్రులు వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో చదివించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్య అధికారి సేవ్ల, ప్రధానోపాధ్యాయురాలు భవాని, మండల మైనార్టీ నాయకుడు సయ్యద్ అహ్మద్ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల విక్రయదారుల అరెస్ట్

- కామారెడ్డి డిఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు గురువారం రాత్రి దుకాణాలు తనిఖీ చేసి పట్టుకున్నట్లు కామరెడ్డి డి.ఎస్.పి నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 13వ తేదీన రాత్రి సమయంలో కామారెడ్డి టౌన్ శాంతి టాకీస్ రోడ్డులో ఉన్న లింగం కిరాణా దుకాణంలో కొమిరిశెట్టి ప్రసాద్, కొమిరిశెట్టి సంతోష్ ఇద్దరు కలసి వారు నిషేధించిన మత్తు పదార్థాలు అయిన పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ తిరుపయ్య, వారి సిబ్బంది, టౌన్ పోలీసులతో కలిసి దాడులు చేపట్టారు. పొగాకు, గుట్కా అమ్మకానికి పెట్టిన సమయములో పోలీసులు పట్టుకొని చట్టప్రకారం పంచుల సమక్షంలో అట్టి నిషేదిత పొగాకు, గుట్కా ను స్వాధీన పరచుకొని నిందితులపై కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్టు కామారెడ్డి డిఎస్పి నాగేశ్వరరావు తెలిపారు. ఇట్టి కేసులో 18 రకాల పొగాకు, గుట్కాలు కలిపి 519 ప్యాకెట్లు రూ.1,14,216 విలువ గల పొగాకు, గుట్కా ను స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థాలు

నిషేదిత పొగాకు, గుట్కాలు ద్వారా వ్యాపారాలు చేస్తూ ప్రజల ప్రాణాలకు హాని కలుగ జేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యూడిషల్ రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి ముందస్తు సమాచారం సేకరించిన టాస్క్ ఫోర్స్ సీఐ తిరుపయ్య, సిబ్బందిని జిల్లా ఎస్పీ సింధు శర్మ, ఐపిఎస్ అభినందించారన్నారు.

ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలి

- శాంతి కమిటీ సమావేశంలో పోలీసులు
- పుకార్లు నమ్మొద్దని సూచన

నవతెలంగాణ-మద్నూర్/పెద్దకొడప్‌గల్/పిట్లం

పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతికమిటీ సమావేశం శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ గో హత్యపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు ఈ సందర్భంగా వెల్లడించారు. పండుగను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దకొడప్‌గల్: బక్రీద్ పండగ సందర్భంగా ఇరు వర్గాల మత పెద్దలను గ్రామ యువకులతో పోలీస్టేషన్‌లో శాంతి సమావేశాన్ని ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కోనారెడ్డి మాట్లాడుతూ పెద్దకొడప్ గల్ మండల వ్యాప్తంగా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నందుకు అన్ని మతాలపెద్దలను, యువకులను ప్రజలను అభినందించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవులను, లేగదూడలను అక్రమ రవాణా చేయొద్దని సూచించారు. పశువులను ఒకచోట నుంచి మరొక చోటుకు తరలించేనప్పు డు సంబంధిత వెటర్నరీ డాక్టర్ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల ప్రతినిధులు శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులతో సహకరించాలని ఆయన సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై,వారి కదలికలపై నిఘా పెట్టామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,కో ఆప్షన్ నెంబర్ జాఫర్ష, బిజెపి నాయకులు రమేష్, ప్రణయ్ రెడ్డి, తానాజీ,ప్రేమ్ సింగ్, నేషనల్ హైవే ఇన్సిడెంట్ మేనేజర్ ప్రతాప్ సింగ్, రాజేశ్వర్, కర్తాల్, మైనార్టీలు మహమ్మద్, రషీద్, ఫెరోజ్, గ్రామ యువకులు ఇరుమతాల పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పిట్లం : బక్రీద్ పండగ పర్వదినానికి గోవులను , లేగ దూడలను కొనుగోలు చేసినా, విక్రయించినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుం టామని ఏఎస్ఐ లింబాద్రి , వెటర్నరీ డాక్టర్ సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్ర వారం మండల కేంద్రంలోని పశువుల సంత (మార్కెట్) పోలీస్, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలకు, సోదరులకు అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఈనెల 17 నిర్వహిస్తున్నందున పర్వదినానికి గాను ఆవులను, తెల్లని కోడెలను అమ్మినా, కొనుగోలు చేపట్టినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువ్యాపారులు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్: మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్


పిట్లంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ లింబాద్రి, వెటర్నరీ డాక్టర్ సంతోష్


పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ కోనారెడ్డి

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపిటిసి, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డి పెట్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న గాండ్ల చరణ్, మొలుగు సువాసిని ఎన్.ఎం.ఎం.ఎస్ విడుదలైన ఫలితాల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు శుక్రవారం ఎంపిటిసి రాజా గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు సంవత్సరానికి ప్రభుత్వం తదుపరి చదువులకు రూ 12,000 అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు యూనిఫామ్స్ అందజేత


పాఠశాలకు స్కూల్ యూనిఫామ్ అందజేస్తున్న డ్వాక్రా మహిళ సంఘాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన స్కూల్ యూనిఫామ్ లను డ్వాక్రా మహిళ సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం కుట్టించిన విషయం విదితమే. మహిళా సంఘాల సభ్యులు ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుకునే బాల బాలికలకు కుట్టిన డ్రెస్‌లను ఐకెపిసిసి విశ్వనాథ్ కామారెడ్డి మండలంలోని లింగాయపల్లి గ్రామాలలో ప్రైమరీ స్కూల్ నందు 324 యూనిఫామ్స్ మూడు పాఠశాల ప్రధానోపాధ్యాయులైన ఎంపీపీ ఎస్, ప్రైమరీ, పాఠశాలకు చెందిన హనుమన్లు , సిద్దయ్య, గోపాల్ లకు ఈ దుస్తులు లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఐకెపి అధ్యక్షులు నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి


మృతి చెందిన చాకలి కాశురాం

నవతెలంగాణ-పిట్లం

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని మారేడు గ్రామానికి చెందిన చాకలి కాశురాం (29) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ గత కొంత కాలం నుండి తాగుడుకు బానిసైయ్యాడు. విపరీతంగా తాగుతూ సంపాదించిన డబ్బులన్నీ మద్యానికి ఖర్చు చేస్తుండటంతో అతని తల్లిదండ్రులు, భార్య తరుచూ మందలించేవారు. అయినా వారి మాట పట్టించుకోకుండా అదేవిధంగా మద్యం తాగుతుండేవాడని , కాగా గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు తన ఆటోలో పిట్లంకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి పిట్లం కు వచ్చి సాయి గార్డెన్ వెనకాల తన ఆటోలో అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా మృతునికి ఇద్దరు కుమారులు , ఒక కూతురు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్పృహ తప్పి కింద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో స్పృహ తప్పి కింద పడి వ్యక్తి మరణించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీ కులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజంపేట్ మండల కేంద్రానికి చెందిన రాజేందర్ (45) మంగళవారం తన తండ్రి కాలు విరగడంతో రక్తదానం చేసి ఆస్పత్రి ఖర్చులకోసం బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు బుధవారం రాజంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి జంగంపల్లి గ్రామ శివారులో రాజేందర్ చనిపోయి కనిపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

ఇండోర్ స్టేడియానికి విరాళం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్



మండలకేంద్రంలో క్రీడాకారుల సౌకర్యార్థం నూతనంగా నిర్మితమౌతున్న ఇండోర్ స్టేడియంకోసం తన వంతు సహాయంగా ముప్కాల్‌కు చెందిన ఎన్నారై సామ నరేందర్ రూ.50 వేల రూపాయలను పంపగా ఆ డబ్బులను శుక్రవారం వారి మామ ఏలేటి గంగారెడ్డి ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్యకు అందజేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గంగాధర్ రెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య, చింతకింది నర్సయ్య, శ్రీనివాస్, రాకేష్, కంచు నరేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు రోడ్డుపై నేలకొరిగిన వృక్షం

నవతెలంగాణ-రెంజల్



రాత్రి కురిసిన ఈదురు గాలులకు మండల కేంద్రం సమీపంలో మహావృక్షం నేలకొరగడమే కాకుండా రోడ్డుపై పడడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వాహనాలకు, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో, సంబంధిత శాఖ అధికారులు వెంటనే అట్టి వృక్షాన్ని తొలగించినట్లయితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వ్యవసాయ అధికారి రాంబాబు



విత్తనాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విత్తనాల డీలర్లు వ్యవసాయశాఖ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో నడిపల్లిలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను అకస్మీకంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల డీలర్లు నిబంధనలు పాటించాల్సి ఉంటుందని వివరించారు. విత్తన డీలర్లు విధిగా రైతులకు విత్తనాల కొనుగోలు బిల్లులను ఇవ్వాలని ఆదేశించారు. విత్తనాల లైసెన్స్ వివరాలను ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను ఏరోజుకారోజు రిజిస్ట్రార్‌లో పొందు పరచాలని సూచించారు. అనంతరం పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మే విధంగా చూసుకోవాలని వారికి సూచించారు.

పీసీసీ పదవికోసం ప్రత్యేక ముడుపులు

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని చౌడమ్మ కొండూరు గ్రామంలో చౌడమ్మ దేవాలయంలో అమ్మవారికి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్ష పదవి రావాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అమ్మవారికి అభిషేకం, అర్చన చేశారు. అమ్మవారి ముందు కొబ్బరికాయ ముడుపు వేయడం జరిగిందన్నారు. మహేష్ కుమార్‌గౌడ్ అధ్యక్ష పదవి వచ్చిన వెంటనే కొండూరు గ్రామంలో అమ్మవారి దేవాలయంకు వచ్చి ఆ ముడుపుని తన చేతుల మీదగా విప్పుతారని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు మహేష్ అన్నకు ఎల్లవేళలా అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తాము కూడా అమ్మవారికి మొక్కు చెల్లించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ సామల దేవిదాస్ గౌడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేతిరి గంగ సాయిలు మండల జనరల్ సెక్రెటరీ బి.రాజేశ్వర్, జి.జీవన్ రవి, సంజీవ్, వెంకటరమణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా పొందిన వారికి సన్మానం



సన్మానించిన స్టాఫ్ క్లబ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు అధ్యాపకులు డాక్టర్ తౌసిప్ ఆహ్మద్, డాక్టర్ జి. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ లత పిహెచ్డి పూర్తి చేసుకొని డాక్టరేట్ ప్రదానం అయిన సందర్భంగా కళాశాలలో స్టాఫ్ క్లబ్ తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామ్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనశాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులు డాక్టర్ తౌసిప్ ఆహ్మద్, తెలంగాణ యూనివర్సిటీ నుండి. జువాలజీ విభాగం హెడ్ డాక్టర్ జి. శ్రీనివాస్ రెడ్డి, కాకతీయ యూనివర్సిటీ నుండి బాటని విభాగం అధ్యాపకురాలు డాక్టర్ డి.లత, ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను పొందారు అని తెలిపారు. డాక్టరేట్ పట్టాను సాధించిన అధ్యాపకులను, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి సతీష్ కుమార్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని కుటుంబ సమేతంగా శుక్రవారం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి స్వాగతం పలకడానికి విమానాశ్రయానికి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడికి వెళ్ళినా ఎమ్మెల్యే అనగానే ప్రత్యేక అభిమానం చూపించారని అన్నారు. తెలుగువారు ఎక్కడ ఉన్న సగర్వంగా ఉండాలని అన్నారు. స్వాగతం పలకడానికి వెళ్లిన వారిలో సంతోష్ రెడ్డి,రాజారెడ్డి,గంగారెడ్డి,తిరుపతి రెడ్డి,సురేష్ రెడ్డి,జింతేదర్ తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల పునఃప్రారంభం

నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం ద్వారా గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ దరఖాస్తుల్లో తప్పిదాల కారణంగా దరఖాస్తుదారులకు ఆ పథకాలు వర్తించలేదు. తప్పిదాలు సరిచేసే క్రమంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సైట్ ఓపెన్ కాక వాటిని సరి చేయలేదు. ఇటీవల ఎన్నికల కోడ్ ముగిసిపోవడంతో దరఖాస్తుదారులు పథకాల అమలుకై ఎదురు చూశారు. ఎట్టకేలకు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న పథకాలు అమలు కాని దరఖాస్తుదారులు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

భగీరథ సర్వేను

సమయానుసారం పూర్తి చేయాలి

- అమ్మ ఆదర్శ పాఠశాలలో త్వరితగతిన పనులను పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ అంకిత్



వర్ని : మాట్లాడుతున్న డీపీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ముప్కాల్/వర్ని(మోస్రా)

ఇందల్‌వాయి మండలంలోని అన్ని గ్రామాలలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను సమయానికి ముందే పూర్తి చేసేవిధంగా చుడాలని నిజామాబాద్ అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి, వెంగళ్ పాడ్,మాల్లపుర్, యెల్ల రెడ్డి పల్లి, లోలం గ్రామాలలో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ మిషన్ భగీరథ హౌస్ హెూల్డ్ ట్యాప్ కనెక్షన్ సర్వేను పరిశీలించారు. ఆయా గ్రామాలలో సర్వేను పరిశీలించి ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నీరు వస్తుందా లేదా అనే విషయంపై ఆరా తీస్తూ ఒక యాప్ లో వివరాలను నమోదు చేస్తున్నామని ఎంపిడిఓ అనంత్ రావు, ఎంపీఓ రాజ్ కాంత్ రావు లు వివరించారు గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి తిరిగినప్పుడు కనెక్షన్ ఉంటే వివరాలు చెప్పాలని, లేకపోతే కొత్త కనెక్షన్ పై వివరాలు తెలిపితే యాప్ లో నమోదు చేసే విధంగా చూడాలని సూచించారు.ప్రతి గ్రామంలోని ప్రజలందరూ గ్రామపంచాయతీ సిబ్బందికి సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందజేసే విధంగా చూడాలని పేర్కొన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలలో త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు దూస్తువులను పంపిణీ చేయాలని,దుస్తులు రాకపోతే త్వరగా తేప్పించి అందజేసే విధంగా చూడాలని డిఆర్ డి ఎ పిడి సాయగౌడ్ కు ఫోన్ లో మాట్లాడుతూ అదేశించారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు తిరునగరి శ్రీధర్, మెకల సువార్త, అనూష, అసాది సాయిలు, తదితరులు ఉన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంలో శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయ అధికారులతో కలిసి మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలించిన డీఎల్పీవో శివరామకృష్ణ ఈ సందర్భంగా మిషన్ భగీరథ పనులపై సర్వే చేస్తూ పనులను పర్యవేక్షించారు. ఎంపీవో భరత్ చంద్రతో మాట్లాడుతూ మిషన్ భగీరథ పనుల నాణ్యత విలువలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి భగీరథ నీరును తప్పక అందించాలని ఎంపీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో భరత్ చంద్ర, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, తాహెర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ని(మోస్రా): మండల గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటింటికి మిషన్ భగీరథ నీటి సర్వేను శుక్రవారం డీపీవో తరుణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని ఇండ్లు ఉన్నాయని పంచాయతీ సెక్రటరీని అడిగి తెలుసుకొన్నారు. మొత్తం ఇండ్లు 1540 ఉన్నాయని, గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లాలను ఏర్పాటు చేయటం జరిగిందని, సెక్రటరీ బానోత్, ప్రేమ్ కుమార్ డీపీవోకు తెలిపారు. తనిఖీ చేసి పలు సూచనలను పంచాయతీ సిబ్బందికి చూచించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ప్రతి ఇంటి యజమానికి మిషన్ భగీరథ నీళ్లు అందేటట్లు చూడాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ అధికారులపై ఉందని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీళ్ల వస్తున్నప్పుడు నీటిని వృథా కాకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు చూసి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. బోధన్ డిఎల్‌పిఓ సాయి, బాబా, ఎంపీఓ మహమ్మద్ రఫీ, గ్రామపంచాయతీ సెక్రటరీ బానోత్ ప్రేమ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది రాము, సిబ్బంది పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: భగీరథ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ముప్కాల్: మాట్లాడుతున్న డీఎల్‌పీవో

కమ్మర్‌పల్లిలో సామాజిక తనిఖీ గ్రామసభ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న అబ్జర్వర్ ఆంధ్రయ్య

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. ఇండి పెండెంట్ అబ్జర్వర్ ఆంధ్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కేంద్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో జరిగిన వివిధ పనులను సభలో డిఆర్పీ నవీన్ చదివి వినిపించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అన్ని పనులపై గ్రామ సభలో చర్చించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరైన సంతకాలు తీసుకోకపోవడం పట్ల సిబ్బందిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలు చేసిన పనుల్లో పలుచోట్ల కొలతలు తేడా ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. అలాంటి చోట్ల మళ్లీ పనులు చేయించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. మొత్తంగా గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమ, ఆశా కార్యకర్తలు, వీఆర్పీలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన

మగ్గిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి పాఠశాల నుండి గత సంవత్సరం జరిగిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ పరీక్షలో 8 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరికి 9,10 ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి 12వేల చొప్పున నాలుగు సంవత్సరాలకి స్కాలర్షిప్ రావడం జరుగుతుందని ప్రధా నో ఉపాధ్యాయురాలు టి హరిత శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అనిల్, కిషన్, గోవర్ధన్, గీత,సురేష్, రాజేందర్, శ్రీనివాస్, గంగాధర్, శ్రీనివాస్, మధు తదితరులు అభినందించారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గానికి సన్మానం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వడ్డెర కాలనీలో గల వడ్డెర సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం పెద్ద మనుషులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సీనియర్ న్యాయవాది ఖాందేష్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాలు, పూల మాలలతో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఖాందేష్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి సభ్యులు ఐక్యతతో కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతో వడ్డెర సంఘం అభివృద్ధికి, నిధుల మంజూరుకు కౌన్సిలర్‌గా తాము కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాందేష్ సత్యం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పెద్ద మనుషులు, గండికోట రాజన్న, బుచ్చి రాజు, బండారి ఎల్లయ్య బండారి నరేశ్, ఎత్తరి రాజారామ్, సాగర్ లతో పాటు సంఘం పెద్దలు మాగిని ఎల్లయ్య, మక్కల ఎల్లయ్య, మక్కల సాయిలు, దండుగుల వెంకటి, సర్వసమాజ్ సభ్యులు మక్కల సంతోష్ ,భూమేష్, తోటన్న తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మేనేజర్‌ను సన్మానిస్తున్న మహిళలు

మండలంలోని అర్గుల్ గ్రామంలోని ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్‌ను మహిళా సంఘాలు శాలువాతో శుక్రవారం సన్మానించారు. అర్గుల్ ఎస్బిఐ బ్యాంకు సేవలందించి ట్రాన్స్‌ఫర్‌పై బ్యాంకు మేనేజర్ సికింద్రాబాద్ వెళ్లడంతో ఎస్బిఐ బ్యాంకు పరిధిలోని పుప్పాలపల్లి, గన్య తండా, మాదాపూర్, బాలనగర్, అర్గుల్, సికింద్రాపూర్ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు కమ్యూనిటీ కోఆర్డినేటర్ కలిసి బ్యాంకు మేనేజర్‌ను సన్మానించారు. నూతనంగా వచ్చిన బ్యాంకు మేనేజర్ రవిని కూడా స్వాగతం పలుకుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు పరిధిలోని గ్రామాలలోని మహిళా సంఘాల ప్రతినిధులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్, వివోఏలు బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ కాబడిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టాంకాం, జపాన్‌లో స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ (ఎస్ఎస్‌డబ్ల్యు) కింద పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని నిజామాబాద్ జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాంకాం ద్వారా శిక్షణ తీసుకోబడిన 2 బ్యాచ్‌ల నర్సింగ్ అభ్యర్థులు 31 మంది ఇప్పటికే జపాన్‌లోని ప్రసిద్ధ ఆసుపత్రులలో పనిచేస్తున్నారని, పేర్కొన్నారు. 3వ బ్యాచ్ నర్సింగ్ అభ్యర్థులు టాంకాం ద్వారా శిక్షణ తీసుకుంటున్నారని, తదుపరి బ్యాచ్‌ల అభ్యర్థుల ఎంపిక కోసం టాంకాం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20 చివరి తేదీ అని బీఎస్సి నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొమా, ఏఎన్ఎం పారామెడికల్, ఫార్మాస్యూటికల్ అభ్యర్థులు 22 నుండి 30 సంవత్సరాల వయస్సు గల నమోదిత కళాశాలల నుండి ఈ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముందస్తు పని అనుభవం అవసరం లేదని, జపనీస్ భాషపై శిక్షణ, జపాన్‌లో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తారని, తెలిపారు. అందులో అవకాశం పొందిన అభ్యర్థులు నెలకు 1.50 నుండి 1.80 లక్షల వరకు సంపాదించవచ్చని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం, ఈ ఫోన్ నంబర్ లను 9951909863, 6302292450, 9573945684 సంప్రదించండి అని పేర్కొన్నారు.

సీహెచ్‌సీలలో ఆయూష్మాన్ ఆరోగ్య మేళా



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని సీ హెచ్ సీపీహెచ్‌సీలలో శుక్రవారం ఆయుష్మాన్ ఆరోగ్యమేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిహెచ్‌సి వర్ని, సిహెచ్‌సి కోటగిరి, బోధన్ గవర్నమెంట్ హాస్పటల్లో ఆరోగ్య మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల డాక్టర్, జనరల్ ఫిజీషియన్, లేడీస్ స్పెషలిస్ట్, స్కిన్ స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు చికిత్సలు అందించారు. బిపి, షుగర్, దీర్ఘకాలిక రోగాలకు, చిన్న పిల్లలకు సంబంధించి వైద్య సేవలు అందించారు. ఆరోగ్య ఆయుష్మాన్ హెల్త్ మేళా కార్యక్రమం ప్రతినెల 14 వ తేదిన నిర్వహించడం జరుగుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. బోధన్ గవర్నమెంట్ హాస్పిటల్ లో జనరల్ ఫిజీషియన్, పీరియాడిక్ డాక్టర్, చర్మ వైద్య నిపుణులు , గైనకాలజిస్ట్ లు రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డా. విద్య పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడి మృతి

నవతెలంగాణ-బోధన్



మండలంలోని కొప్పర్గ గ్రామ మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్ ఖలీల్ గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. గతంలో మాజీ ఎంపీటీసీగా, ఆయన భార్య మాజీ సర్పంచ్‌గా, ఖదీర్ పటేల్ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామంలో, మండలంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా ఆయన అందరిని కలుపుకొని పోతూ పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఆయన మృతి పట్ల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఖలీల్ పటేల్ అంత్యక్రియలలో బోధన్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్ తగిలి రైతు మృతి



- ఖానాపూర్‌లో ఘటన

నవతెలంగాణ- నిజామాబాద్‌రూరల్

ఖనాపూర్‌లోని పొలంలో కరెంటు వైర్‌కు టేపు చుడుతూ ఉండగా రైతు కరెంట్ షాక్ తగిలి చనిపోయాడు. రూరల్ ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. నిమ్మశంకర్ (68) నిజామాబాద్ జిల్లాకేంద్రంలోనిఅంబేద్కర్ కాలనీచెందిన వ్యక్తి. ఆరు సంవత్సరాలుగా ఖానాపూర్ శివారులో గల సత్యపాల్ మిశ్రా వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నాడు. శుక్ర వారం ఉదయం తాను కౌలుకు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి అక్కడ కరెంటు వైర్ కట్ అయి ఉండడం చూసి దానికి టేప్ చుట్టాడు. ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయినాడు. శంకర్ భార్య నిమ్మ రాజమణి దరఖాస్తు ఇవ్వగా రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట్ మండల కేంద్రానికి చేందిన కాశి నాగేష్(20) తల్లిదండ్రులు చనిపోతే.. వారి పెద్దనాన్న వాళ్ల ఇంట్లో ఉండేవాడు. కూలీ పనులు చేసుకుంటూ ఉంటుండేవాడు. అయితే తరచుగా తమ తల్లిదండ్రులను గుర్తుచేసుకుంటు బాధపడుతూ తనకు ఎవరు లేరని ఎవరి కోసం బతికి ఉండాలని మనోవేధనకు గురయ్యేవాడు. రోజు మాదిరిగానే శుక్రవారం మధాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ



ఆర్మూర్:గోవింద్‌పేట్(వి) పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



డిచ్‌పల్లి: పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న పలువురు



రెంజల్: మాట్లాడుతున్న ఎంపీపీ

- విద్యార్థులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఆర్మూర్/రెంజల్/మాక్లూర్/డిచ్‌పల్లి/బోధన్

ఆర్మూర్: మండలంలోని గోవింద్‌పేట్(వి) ప్రాథమిక పాఠశాల లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ పాల్గొని మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో విద్యా బోధన చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుకన్య, ఉపాధ్యాయ బృందం మాడ వేడి పద్మావతి ,,విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలోని రెండవ వార్డు పరిధిలో గల వడ్డెర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ముఖ్య అతిథి మున్సిపల్ కౌన్సిలర్ ప్రముఖ మహిళా న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు సంగీత ఖాందేష్ చేతుల మీదుగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంగీత ఖాందేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నదని, విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమ్మల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెంజల్ :మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ఎంపీపీ రజనీకిషోర్, ఎంపీడీవో హెచ్. శ్రీనివాస్, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ, మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా నాణ్యమైన విద్యా బోధన, ఆంగ్ల మాధ్యమం బోధిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గణేష్ రావు, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఆంజనేయులు, పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి. సోమలింగం గౌడ్, సాయ రెడ్డి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు అనురాధ, ఎమ్మార్పీ సుమలత, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపీపీ రజనీకిషోర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ గణేష్ రావు శుక్రవారం సందర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభమయ్యే ఈ పాఠశాలలోని వసతులను వారు పరిశీలించారు. సుమారు 23 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని చిన్నాపూర్, మామిడిపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ద్వారా మంజూరైన పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మస్త ప్రభాకర్, ఎంపీడీఓ క్రాంతి, ఎంపీఓ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లా రెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు కే. బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: నూతన విద్యాసంవత్సరం సందర్భంగా మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ప్రభుత్వం ద్వారా వచ్చిన నూతన పాఠ్యపుస్తకాలను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాజశశికళ, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి లచ్చమెల్ల దత్తాద్రి ప్రధానోపాధ్యాయులు కొండ గోవర్ధన్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదని గ్రామానికి పేరు ప్రఖ్యాతులు పేరు ప్రఖ్యాతులు తీసుకుని వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమమైన అధ్యాపకులు బోధిస్తారని అన్నారు. దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అన్నింటిని సమకూరుస్తుందని తెలిపారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు సక్కెర్ల పెద్ద రాజన్న, ఈదుల నర్సా గౌడ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బోధన్ మండలంలోని అమిర్ ఆలీ నగర్ ప్రాథమిక పాఠశాల, అందాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం గంగారాం , సొసైటీ చైర్మన్ రవీంద్ర బాబు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రణవ్, హెచ్ఎం శివకుమార్ , సిఆర్పీ శివనంద్ , పాల్గొన్నారు.

జడ్‌పిహెచ్‌ఎస్‌కు డెస్క్ బెంచీల వితరణ



పాఠశాలకు అందజేస్తున్న డెస్క్ బెంచీలు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని జాగిర్యాల జెడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు బాల్కొండ మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి 40 డెస్క్ బెంచీలను లక్షా 50వేల విలువగలవి అందజేశారు. అందుకు సహకరించిన దయానంద్ రెడ్డి సోదరి నీలారాణి- ఎస్‌జీటికి, దయానంద రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు జాగిర్యాల గ్రామం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఒక దాతగా అనేక పాఠశాలలకు తన వంతుగా విద్యార్థులకు ఆటల కిట్లు, డిస్క్ బెంచీలు, ప్యానెల్ బోర్డులు, ప్రయోగశాలల సామాగ్రిని దాతగా వితరణ చేస్తూ పాఠశాలలకు చేయూతనిస్తున్నారు. ఈ సందర్భంగా దయానంద్ రెడ్డి సోదరి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మన గ్రామ ప్రభుత్వ పాఠశాలలను మనమే తోచినంత విరాళాన్ని ఇచ్చి అభివృద్ధి చేసుకొని గట్టి పోటీ ఇవ్వాలని విద్యార్థులకు వారి వారి తల్లిదండ్రులకు ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంఈఓ స్వామి, ప్రధానోపాధ్యాయురాలు కళావతి,ఉపాధ్యాయులు వెంకయ్య, తాజా మాజీ సర్పంచ్ కే, మానస శ్రీనివాస్, ఎంపీటీసీ సుమలత రాజేశ్వర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యధికారి

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని మదన్ పల్లి, మదన్ పల్లి క్యాంపు గ్రామాలలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులకు, గేదెలకు గొంతు నొప్పి, జబ్బవాపు టీకాలు డా. కిరణ్ దేశ్ పాండే శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులకు సంబంధించి పశువులకు వచ్చే గొంతు నొప్పి, జబ్బవాపు టీకాలు పశు వైద్య కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. తొలకరి జల్లులు పడగానే క్లాస్ట్రీడియం అనే బ్యాక్టీరియా విడుదల చేసే విష పదార్థం వల్ల వ్యాధి వస్తుందని, చిటుక వేసినంత కాలంలోనే విష పదార్థం విడుదల రావడం వల్ల జీవాలు చనిపోతాయని అన్నారు.. పశు పోషకులు, రైతులు తమ జివాలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ వినీత, విఏ అహ్మద్ పాషా, జైల్ సింగ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాలబైరవ స్వామిని దర్శించుకున్న జిల్లా కోర్టు జడ్జి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని జిల్లా కోర్టు జడ్జి సి హెచ్ వి ఆర్ ఆర్ వరప్రసాద్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో ప్రభు రామచంద్రం శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏ ఎస్ ఐ రవీందర్, ఆలయ సిబ్బంది సురేందర్, నాగరాజు, రంజిత్ తదితరులు ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-దోమకొండ

ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై గణేష్ సూచించారు. దోమకొండ మండల కేంద్రంలోని ముత్యంపేట్ రోడ్డు ప్రాంతంలో వాహనాలు తనిఖీ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, తదితర ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమం లో పోలీస్ లు కిరణ్, సాయిల్, లింగం తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని విత్తన డీలర్ షాప్స్‌లలో కామారెడ్డి నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు విత్తనాలు దుకాణాలను తనిఖీలు చేపట్టారు. విత్తన షాప్స్‌లలో స్టాక్ రిజిస్టర్లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, బిల్ బుక్స్ వెరిఫై చేశారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, అలాగే విత్తనాలు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్స్ ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. ఈ తనిఖీలలో కామారెడ్డి టాస్క్ ఫోర్స్ సభ్యులు కామారెడ్డి ఏడిఏ అపర్ణ, కామారెడ్డి ఏవో శ్రీనివాస్, దోమకొండ ఏవో పవన్ కుమార్, గాంధారి మండల వ్యవసాయ అధికారి ఆర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పండగను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్సై రాజు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మాట్లాడుతున్న ఎస్సై రాజు

బక్రీద్ పండుగ సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజు శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగను శాంతియుతంగా జరుపుకోవాలని ఇరు వర్గాలకు సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

వేం పురుషోత్తం రెడ్డికి నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణా ప్రభుత్వ ప్రధాన సలహాదారులు (సీఎం వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి సోదరులు వేం పురుషోత్తం రెడ్డి ప్రథమ వర్ధంతిలో శుక్రవారం వరంగల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పండిత్ పవన్, కాంగ్రెస్ నాయకులు చిట్టి రెడ్డి, రాజు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలానికి మంజూరైన 41136 నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను శుక్రవారం బోధన్ మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ నాగనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, ఇక్బాల్, నగేష్, సిఆర్పి లు విజయ్,బాబు ,శివానంద్ పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని జాగిర్యాల్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు పై ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) సంరక్షణ కార్యదర్శి రమాదేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా జాగిర్యాల గ్రామంలోని ఒకటో నెంబర్ అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న విద్యార్థులు, గర్భిణీలు, బాలింతల హాజరు పట్టిక పట్టికను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న సరుకుల నిల్వలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. పిల్లల బరువు ఎత్తులను పరిశీలించారు. తనిఖీ సమయంలో కేంద్రంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంపై అంగన్వాడీ కార్యకర్త ను ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్ర పనితీరు లో పారదర్శకతను పెంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో మిగితా అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నవతెలంగాణ-రామారెడ్డి

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి శుక్రవారం సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట బి ఆర్ ఎస్ నాయకులు ల్యా గల మహిపాల్, కర్రల రాజు, డాక్టర్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

వజ్రఖండి ప్రభుత్వ పాఠశాలలో బడిబాట

నవతెలంగాణ-జుక్కల్



బడిబాటలో పాల్గొన్న విద్యార్థులు

మండలం లోని వజ్రఖండి గ్రామంలోని ఎంపిపీ యస్ పాఠశాలలో హెచ్ఎమ్ కాంబ్లే సాయులు ఆధ్వర్యంలో బడిబాట శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థుతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలకు ఖచ్చితంగా పాఠశాలకు పంపాలని, పిల్లలతో పనులు చేయించరాదని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాలని అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థులతో ఉపాద్యాయులు , విద్యార్థుల తల్లి దండ్రులు కలిపి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, హెచ్ఎం సాయులు, ఉపాద్యాయ బృందం పాల్గొన్నారు.

సంఘం పేరుతో డబ్బులు అడిగితే తెలపండి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్.బాల్ రాజ్ పిడిఎస్‌యూ పేరుతో డబ్బులు అడిగితే ఇవ్వొదని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఆర్ గౌతమ్ కుమార్ -జన్నారపు రాజేశ్వర్ సూచించారు.. నగరంలోని కోటగల్లి ఎన్ ఆర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీర్కూర్ మండలానికి చెందిన ఎన్ బాలరాజు గత కొంతకాలంగా పిడిఎస్‌యూ కు ఎలాంటి సంబంధం లేకుండా పిడిఎస్‌యూ పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం దగ్గర ప్రభుత్వ హాస్టల్స్ వార్డెన్స్ దగ్గర ఫోన్లు చేసి బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు దిగి అక్రమ ఆర్థిక వసూళ్లకు బాలరాజు అనే వ్యక్తి పాల్పడుతున్నారని అన్నారు. ఎలాంటి కార్యక్రమాలు చేయకుండానే హైదరాబాద్, నల్గొండ జిల్లాలో ప్రోగ్రాం ఉందని, వెళ్లాలని డబ్బులు అడగడంతోపాటు తన కుటుంబీకులకు బాగాలేదని, చావు బతుకుల్లో ఉన్నారని, చనిపోయారని ఇలా రకరకాల అబద్ధాలు చెప్పి ఫోన్లు చేసుకుంటూ డబ్బులు అడుగున్నాడని అన్నారు. దాబా హోటల్ వ్యాపారం ,చిట్స్ ఫండ్స్ వ్యాపారం, ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారం, ఎలక్షన్ క్యాంపియన్ ఏజెన్సీ వ్యాపారం పేర్లతో సామాన్య ప్రజలను సైతం మోసం చేశాడని ఎట్టి పరిస్థితుల్లో నమ్మొదని ప్రజలను కోరారు. చెక్ బౌన్స్ కేసులు, చీటింగ్ కేసులు, మద్యం తాగి కారుతో విద్యార్థి కాళు విరగొట్టి యాక్సిడెంట్ చేసిన యాక్సిడెంట్ కేసు బోధన్ కోర్టులో ఇంకా ఉన్నాయని తెలిపారు. డబ్బులు అడిగితే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని లేదా పోలీసు అధికారులకి ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యెన్. కార్తీక్,(బోధన్), జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్ (ఆర్మూర్), జిల్లా నాయకులు రవీందర్ (తెలంగాణ యూనివర్సిటీ), నిఖిల్ (నగరం) తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులపై ప్రతిపాదనలు పంపండి

- పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్ మెంట్ ఈఈ తిరుపతి కుమార్
- అసంపూర్తి మరుగుదొడ్లు పరిశీలన

నవతెలంగాణ - బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) లో మన ఊరు మనబడి పథకంలో భాగంగా చేపట్టిన బాలికల మరుగుదొడ్ల పనులు నిధులు మంజూరు కాక అసంపూర్తిగా నిలిచిపోయాయి. దాంతో ఈ పాఠశాలలో గల బాలికలకు మరుగుదొడ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం ఈ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం భాగంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్న సందర్భంగ వారికి ఈ పాఠశాలలో గల అసంపూర్తి మరుగుదొడ్ల సమస్యను హెచ్ఎం బాలచంద్రం వివరించారు.



మాట్లాడుతున్న ఈఈ తిరుపతి కుమార్

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్ల పనులను పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం పబ్లిక్ అండ్ హెల్త్ విభాగం ఈఈ తిరుపతిరావు బోధన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల జేసిని సందర్శించి అసంపూర్తిగా నిలిచిన పనులను పరిశీలించారు. బాలికల మరుగుదొడ్లు పూర్తి కావడానికి ప్రతిపాదనలు పంపాలని, ఉపాధ్యాయుల టాయిలెట్స్ మరమ్మతులు, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం అందించడానికి ట్యాంక్ ఏర్పాట, పాఠశాల భవనం పైకప్పు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు సూచించారు. అలాగే లీకేజీలు ఉన్న వాటిని గుర్తించి, కిచెన్ షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు త్వరగా పంపాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డిఈ నగేష్ రెడ్డి, మున్సిపల్ ఏ.ఈ.లు శ్రీనివాస్, శివ కృష్ణ, హెచ్ . ఎం బాలచంద్రం, సీనియర్ ఉపాధ్యాయులు నగేష్ బాబు తదితరులున్నారు.

అన్ని దానాల కంటే రక్తదానం మహాగొప్పది

- డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్
- ధర్మారంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అన్ని దానాల కంటే రక్తదానం మహా గొప్పదని దీన్ని వేల కట్టలేనిదని ఆపదలో ఉన్న సమయంలో ఈ రక్తం ఎంతగానో తోడ్పడుతుందని డీఎంహెచ్వో తుకారం రాథోడ్ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బి గ్రామంలో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్త దాన శిబిరంను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. తుకారాం రాథోడ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ముఖ్యంగా యువత రక్త దానం చేయడాన్ని అలవాటు చేసుకుంటే అది అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు , గర్భిణీ స్త్రీలకు, ప్రమాదాలలో గాయపడ్డ వారి విలువయిన ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. అంతే కాకుండా చెడు కొలెస్ట్రాల్ ను అధిక బరువును, గుండె జబ్బులను నియంత్రిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సూర్య ఆరోగ్య సంస్థ వారు ప్రజలను చైతన్య పరుస్తూ రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తూకారం రాథోడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు గ్రామస్తులు తరలివచ్చి 42 యూనిట్ల రక్తం ఇవ్వడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ చేకూరి,సంస్థ ప్రతినిధులు కె రామకృష్ణ, పి నాగేశ్వర రావు, రాజేంద్ర కుమార్ విక్రమ్, ప్రశాంత్, వినోద్, డి పి ఎమ్ సుధాకర్,ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ - ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిజామాబాద్ జి వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు